క్లుప్తంగా

కార్తికేయుని సన్నిధిలో భక్తుల రద్దీ



మోపిదేవి: ప్రసిద్ధపుణ్యక్షేత్రంగా విరాజిల్లు తున్న మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో తెల్లవారు జాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ప్రధాన క్యూలైన్లతో పాటు ఆలయ ప్రాంగణం భక్తజనంతో నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థుల బహుమతులకు రూ. లక్ష విరాళం



మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాల 75వ వార్షికోత్సవం సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జెడ్పీటీసీ సభ్యుడు, పూర్వ విద్యార్థి మెడబలిమి మల్లికార్జునరావు రూ. లక్ష విరాళంగా పాఠశాల హెచ్ఎం జయంతికి అందజేశారు. ఫిబ్రవరి 1వ తేదీ పాఠశాల వార్షికోత్సవం జరుగనుంది. గతేడాది 'పది'లో అత్యధిక మార్కులు సాధించిన మేడికొండ మోనాకు 8 గ్రాముల బంగారంతో తయారు చేసిన గోల్డ్‌చైయిన్ బహుమతిగా ఇవ్వనున్నారు. పాఠశాలలో 6 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో ప్రథమ(5 వేలు), ద్వితీయ(3 వేలు), తృతీయ(2 వేలు) స్థాయిలో నగదు బహుమతి ఇవ్వనున్నట్లు పాఠశాల హెచ్ఎం జయంతి వివరించారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ రావి ప్రభుదాస్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు పూర్తి



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఆంధ్రజాతీయ కళాశాల సమీపంలో ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతు పనులను విద్యుత్‌శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. సబ్‌స్టేషన్‌లో బస్ సెక్షనలైజర్ ఫిక్స్‌డ్ మూవింగ్ కాంటాక్ట్ పరికరాల దెబ్బతినటంతో వాటిని మార్చే పనులు నిర్వహించారు. ఈ పనుల కారణంగా ఉదయం 7 నుంచి 10 గంటల వరకు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. భాస్కరరావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే 9.30 గంటలకే పనులు పూర్తికావటంతో విద్యుత్ సరఫరాను అరగంట ముందే పునరుద్ధరించారు. ఈ పనులను ఈఈ భాస్కరరావు పర్యవేక్షించారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



మోపిదేవి: పేదలకు ఆరోగ్యం అందించేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు అన్నారు. మండల కేంద్రం మోపిదేవి ఆదర్శ పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి శిబిరాన్ని ప్రారంభించగా, ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ మల్లికార్జునరావు మాట్లాడుతూ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పరుచూరి అంజయ్య మనమడు ఎన్ఆర్ఐ లీలాకృష్ణ ఆర్థిక సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో వైద్య నిపుణులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఉపసర్పంచ్ కోనేరు సుందర్‌సింగ్, కొల్లి మురళీ, గద్దె శ్రీ హరి, పరుచూరి రాంబాబు, పరుచూరి శ్రీనివాసరావు, గొరిపర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం'కు సన్నద్ధం కావాలి



బంటుమిల్లి సచివాలయం వద్ద కార్యకర్తలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త రాము



గూడూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదన్

పెడన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉప్పాల రాము

బంటుమిల్లి: ఎన్నికల శంఖారావంలో భాగంగా ఫిబ్రవరి ఒకటో తేదీన ఏలూరులో నిర్వహించనున్న 'సిద్ధం' బహిరంగ సభను విజయవంతం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పార్టీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలో గ్రామ, గ్రామాన విస్తృతంగా పర్యటించి నాయకులతో, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఏలూరులో నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేసేందుకు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలాలని ఆయన పిలుపునిచ్చారు.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరా..

అనంతరం బంటుమిల్లి సచివాలయం వద్ద జరిగిన గ్రామ సభలో రాము మాట్లాడుతూ బంటుమిల్లి గ్రామ తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 17 లక్షలు నిధులు కేటాయించామన్నారు. ఫిబ్రవరి నెలాఖరుకల్లా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారు. మల్లేశ్వరం, చోరంపూడి తదితర గ్రామాల్లో ఇసుక ఫిల్టర్లు, మైక్రో ఫిల్టర్ల మరమ్మతులకు నిధులు కేటాయించామని రాము పేర్కొన్నారు. తొలుత బంటుమిల్లిలో బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు తిరుమాని శ్రీనివాసరావు, ఎంపీపీ వెలివెల చినబాబు, సర్పంచ్ బండారు చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, ఎంపీటీసీలు వీరబాబు, కమాల్‌బాషా, తిరుమలశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ గంధం శేషగిరి, మండల పార్టీ కార్యదర్శి పి. శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప్పాల రాము పర్యటన...

కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము సోమవారం మండలంలో పర్యటించనున్నట్లు ఆయన పార్టీ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల్లోని పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమవుతారన్నారు. 'సిద్ధం' కార్యక్రమానికి అంతా హాజరయ్యేలా పార్టీ నాయకత్వానికి సూచనలు చేయనున్నట్లు తెలిపారు.

పార్టీ శ్రేణులంతా 'సిద్ధం' కావాలి..

గూడూరు: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏలూరులో నిర్వహించనున్న సిద్ధం సభకు తరలి వెళ్లాలని గూడూరు ఎంపీపీ మధుసూదన్ రావు పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన ఇన్‌చార్జ్ ఆదేశాల మేరకు ఆదివారం గూడూరులో ఎంపీపీ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఏలూరు సభకు పార్టీ శ్రేణులు తరలి వెళ్లేలా నాయకులూ చొరవ తీసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు సందేశాన్ని ప్రజలకు ఇవ్వాలన్నారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, లింగం విజయ్ కుమార్, డైరెక్టర్ త్రినాథ్, గమిని కృష్ణ, తలుపుల ఫణి, వీరంకి సుబ్రహ్మణ్యం, ఉదయ్, సుధాకర్, శివాజీ, రమేష్, నాగూర్, బాషా పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ



విద్యుత్‌శాఖ ఈఈ భాస్కరరావు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఎలక్ట్రికల్ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని పుట్లమ్మచెరువు వద్ద ఉన్న తమ కార్యాలయంలో మూడు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ముందుగా విద్యుత్ వినియోగదారులు ఏపీఈఆర్‌సీ వెబ్‌సైట్, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్లలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకున్న వినియోగదారులు తమ కార్యాలయానికి విచ్చేసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో వారి సలహాలు, సూచనలు, అభ్యంతరాలు చెప్పాలన్నారు. ప్రధానంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కం ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై తమ అభిప్రాయాలను వినియోగదారులు తెలియజేయవచ్చునన్నారు. ఏపీఈఆర్‌సీ రెగ్యులేషన్ కమిషన్ ప్రకారం ఏటా ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ కలిగిన విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్‌సీకి వచ్చే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన టారిఫ్ ప్రతిపాదనలను సమర్పిస్తాయన్నారు.

తీరప్రాంతాలలో మరింత విస్తృతంగా ఆర్టీసీ సేవలు



పిన్నెంటి మహేష్

కృత్తివెన్ను: తీరప్రాంతాలైన మచిలీపట్నం, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు ఆర్టీసీ సేవలను మరింత విస్తృతంగా అందిస్తున్నట్లు ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ అన్నారు. దీనిపై ఆయన ఆదివారం మాట్లాడారు. విజయవాడ నుంచి కాకినాడ, కాకినాడ నుంచి విజయవాడకు కృత్తివెన్ను మీదుగా వెళ్లే అల్ట్రా డీలక్స్ బస్సుకు ప్రయాణికులు విన్నపం మేరకు ఇప్పుడు కృత్తివెన్నులో స్టాపు కేటాయించినట్లు వివరించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వాడపల్లికి మచిలీపట్నం నుంచి బస్సు సర్వీసు ఉందని, రాకపోకలకు (అప్ అండ్ డౌన్)కు సంబంధించి ముందుగానే టికెట్‌ను 35071కు కాల్ చేసి రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను, పల్లెపాలెంలలో స్టాపులు ఉన్నట్లు పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

కోడూరు: డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నాల్గో విడత నగదు చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 10గంటలకు జరిగే ఈ చెక్కు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు హాజరవుతారన్నారు. బుక్‌కీపర్లు, వీఓఏలు, డ్వాక్రా మహిళలు హాజరు కావాలని ఏపీఎం కోరారు.

నేడు అంగన్‌వాడీ భవనం ప్రారంభం

కోడూరు: మండలంలోని పెదగుడుమోటు గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరీ ఆదివారం తెలిపారు. రూ.12లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తారన్నారు. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ కేంద్రాన్ని కూలదోసి నూతన భవన నిర్మాణం చేసినట్లు రాజరాజేశ్వరీ చెప్పారు.

జిల్లా స్థాయి అవార్డు గ్రహీతకు సన్మానం



చల్లపల్లి: గణతంత్ర వేడుకల్లో జిల్లా స్థాయి ఉత్తమ టైపిస్ట్ అవార్డు అందుకున్న మోపిదేవి మండల పరిషత్ కార్యాలయ టైపిస్ట్ పూసపాటి బ్రహ్మానందరావుకు ఘనంగా సన్మానం జరిగింది. ఆదివారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మానందరావును సత్కరించారు. సంఘ రాష్ట్ర నాయకులు నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, అడ్డాడ ప్రసాద్ బాబు, శామీరుపేట సాయి బాబు, కేశనకుర్తి శరత్ బాబు, మండల నాయకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

గుడివాడరూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని టూటౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు పేర్కొన్నారు. టూటౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన దుర్గారావును శ్రీ కృష్ణయాదవ సేవా సంఘం సభ్యులు, మిత్రమండలి సభ్యులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపతామన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు, ఇతర జూదాలు నిర్వహిస్తే వెంటనే స్థానికులు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంతా ఉంచుతామని సీఐ స్పష్టం చేశారు.

అవగాహనతో అధిగమిద్దాం

- మినుము పంటలో తెగుళ్ల నివారణకు శాస్త్రీయ పరిజ్ఞానం అవసరం
- తగిన జాగ్రత్తలతో లాభాల పంట
- వ్యవసాయశాఖాధికారి జెన్నీ సూచనలు



వ్యవసాయాధికారి జెన్నీ

కృత్తివెన్ను: తీరప్రాంతమైన పెడన నియోజకవర్గంలో రెండో పంటైన రబీ (వరి) లేకపోవడంతో రైతులు అవకాశం ఉన్న భూముల్లో రెండో పంటగా అపరాలను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా అధికశాతం మంది మినుమును పైరుగా వేశారు. సాగు ప్రారంభంలో వచ్చిన మిచౌంగ్ తుపాను ప్రభావం మినుము పంటపై భారీగానే పడింది. దీంతో ఇప్పుడు మినుము పంటకు రకరకాల తెగుళ్లు సోకేందుకు అవకాశం ఉందని రైతులు అవగాహనతో మసలుకుంటే లాభాల పంట పండించుకోవచ్చని వ్యవసాయ శాఖాధికారి ఎస్. జెన్నీ అంటున్నారు. మినుముకు సోకే పలు రకాల తెగుళ్ల వాటి నివారణపై ఆమె పలు సూచనలు చేస్తున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

అవగాహన ముఖ్యం

తీరప్రాంతమైన పెడన నియోజకవర్గంలో దాదాపు 16,250 హెక్టార్లలో మినుమును రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పూత, కాయకట్టు దశలో ఉంది. ఈ సమయంలో రైతులు పోషక, రక్షణ చర్యలను చేపడితే మంచి లాభాలు సొంతం చేసుకోవచ్చు.

బూస్టర్ డోస్..

పూత నుంచి కాయకట్టు దశలో ఉన్న పంటమీద లీటరు నీటిలో 5–10 గ్రాముల 19–19–19 మందును కలిపి సమంగా పిచికారీ చేయాలి. దీనివల్ల కాపు వృద్ధి చెంది దిగుబడులు పెరుగుతాయి. తేలికపాటి నేలల్లో సాగుచేసిన వారు, పంట కుంటలు ఉన్న వారు ఈ దశలో ఒకతడి నీరందిస్తే చాలా ఉపయోగం ఉంటుంది.



తెగుళ్ల నివారణకు రసాయనిక ఎరువులు పిచికారీ చేస్తున్న రైతు

సస్యరక్షణ చర్యలు..

పూత నుంచి కాయకట్టు దశలో ముఖ్యంగా పంటను ప్రధానంగా ఆశించేది మారుకమచ్చల పురుగు. ఇది పంటలో మొగ్గ, పూత, పిందె మూడు దశల్లోనూ పంటకు తీవ్రనష్టాన్ని కలిగిస్తుంది. పూతను, ఆకులను ఒక గూడులా (వెబ్) అల్లి లోపల ఉండే మెత్తని పదార్థాన్ని సారాన్ని తినేస్తుంది. కాయలను దగ్గరగా చేర్చి గూడుకట్టి కాయలకు రంధ్రం చేసి లోపలి గుజ్జును పూర్తిగా తినేస్తుంది.

నివారణ..

పూతదశలో తప్పనిసరిగా వేపగింజల కషాయం లేదా వేపనూనె 5 మి.లీ.లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. దీనివల్ల పెట్టిన గుడ్లు చనిపోతాయి. దీని వికర్షణ గుణం వల్ల రెక్కల పురుగులు ఇంకా గుడ్లు పెట్టవు. గూళ్లను విడదీసి పురుగులు కనిపిస్తే వెంటనే ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరీఫైరీఫాస్ 2.5 మి.లీ లేదా నోవాల్యురాన్ 1 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ తెగులు..

ఆకులపై గుండ్రని చిన్న గోధుమ మచ్చలు ఏర్పడి అనుకూల పరిస్థితిలో తెగులు ఉధృతమై ఈ మచ్చలు అన్ని కలిసిపోయి ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. దీని నివారణకు లీటర్ నీటిలో 2 మి.లీ హెక్సాకొనాజోల్ లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపి పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

బూడిద తెగులు..

ఉదయం పూట మంచు పడుతున్న తరుణంలో ఆకులపై చల్లిన బూడిదలాగా చిన్నచిన్న మచ్చలు ఏర్పడి క్రమేణా పెద్దవై ఆకులపైనా కింద విస్తరిస్తాయి. చివరకు కొమ్మలకు, కాయలకు పాకుతాయి. దీని నివారణకు లీటరు నీటిలో 2 మి.లీ హెక్సాకొనజోల్ లేదా 1 మి.లీ కెరథేన్ కలిపి పదిరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

తుప్పు లేదా కుంకుమ తెగులు..

పూతదశలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. మొదట పసుపు రంగు మచ్చలు చిన్నగా ఆకుల మీద ఏర్పడి ముదిరాక కుంకుమ, తుప్పు రంగుమచ్చలుగా మారతాయి. దీని నివారణకు లీటరు నీటిలో ఒక ట్రిడీ మార్ట్‌ను కలిపి పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

పల్లాకు తెగులు..

ఇది జెమినీ వైరస్ వల్ల వ్యాపిస్తుంది. పీయూ 31 రకం దీన్ని పూర్తిగా తట్టుకుంటుంది. ఎల్‌బీజీ752 రకంలో ఈ తెగులు ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వైరస్ తెల్లదోమ వల్ల వస్తుంది. తెల్లదోమ నివారణకు లీటరు నీటిలో ట్రైజోఫాస్ 1.5 మి.లీ లేదా అసిఫేట్ 1.5 లేదా ఆసీటామిప్రిడ్ 0.2 గ్రాములు చొప్పున కలిపి మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలి.

ఆలయాల అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక కృషి

బందరు ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని స్థానిక శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. నగరంలోని రాబర్ట్సన్‌పేటలో వేంచేసియున్న శ్రీ రంగనాయక స్వామి దేవస్థానం ముఖమండపం, క్లోజ్డ్ మండపం పునర్నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. దేవదాయ, ధర్మదాయశాఖ సర్వ శ్రేయో నిధి నుంచి రూ. 42.50 లక్షలు, భక్తుల విరాళాలు రూ. 7.50 లక్షలు మొత్తం రూ. 50లక్షలతో ఈ మండపాల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ఆలయాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలను మంజూరు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే నగరంలోని గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దాదాపు రూ. 2 కోట్లతో పునఃనిర్మించామన్నారు. అలాగే నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధికి, మరమ్మతు పనులను కూడా చేశామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహణ్యేశ్వరరావు, తరకటూరు ఎంపీటీసీ జక్కా ధర్మారాయుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్ నాయుడు, ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

'ఆడుదాం ఆంధ్రా'లో జిల్లా స్థాయికి..

పెడన: నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ముగియడంతో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్బన్, రూరల్ జట్లు ఎంపికయ్యాయి. ఇందులో భాగంగా వాలీబాల్ పురుషులు, మహిళల విభాగంలో కాకర్లమూడి, పుల్లపాడు సచివాలయాల జట్లు విజేతలుగా నిలిచాయి. అలాగే బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో అగస్తేశ్వరపురం సచివాలయం జట్టు, ఖో–ఖో పురుషులు, మహిళల విభాగంలో బలిపర్రు, బ్రహ్మపురం సచివాలయాల జట్లు అర్హత సాధించారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన మండలానికి గుర్తింపు తెచ్చిన క్రీడాకారులను ఎంపీడీఓ రెడ్డెయ్య అభినందించారు.

బంటుమిల్లి జట్లు ఇవే..

బంటుమిల్లి: వాలీబాల్ పురుషులు, మహిళల విభాగంలో మల్లంపూడి, చోరంపూడి సచివాలయాల జట్లు విజేతలుగా నిలిచాయి. అలాగే బ్యాడ్మింటన్ పురుషులు, మహిళల విభాగంలో బంటుమిల్లి–2, నాగేశ్వరరావుపేట, ఖో–ఖో పురుషులు, మహిళల విభాగంలో పెదతుమ్మిడి జట్లు, కబడ్డీ ఆటలో బంటుమిల్లి పురుషుల జట్లు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన మండలానికి గుర్తింపు తెచ్చిన క్రీడాకారులను ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్ అభినందించారు.



జిల్లా పోటీలకు సిద్ధమైన చోరంపూడి, మల్లంపూడి సచివాలయాల వాలీబాల్ జట్లు

ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీ

గూడూరు: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఆదివారం గూడూరులోని రైతు కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీపీ సంగా మధు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నగదు రహిత వైద్య సేవల పరిమితిని రూ. 5 లక్షల నుంచి 25 లక్షలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. తద్వారా నిరుపేద ప్రజలు కూడా కార్పొరేట్ ఆస్పత్రులలో అత్యవసర వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు చేయించుకునే అవకాశం దక్కిందన్నారు. ఉచితంగా వైద్య సేవలు అందించడమే కాకుండా రోగులు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు ఆసరా కూడా అందిస్తున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రజల ముంగిటకే తీసుకొచ్చామన్నారు. పేదల ఆరోగ్యం పెట్ల ఇంతటి శ్రద్ధ చూపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని నిండు మనసుతో ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, వైఎస్సార్సీపీ నాయకులు గొరిపర్తి. రవి కుమార్, లింగం విజయ్ కుమార్, సీహెచ్‌సీ డైరెక్టర్ త్రినాథ్, మాజీ డీసీ చైర్మన్ గమిని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న ఎంపీపీ మధు

నాగాయలంకలో 86.95 శాతం కులగణన పూర్తి

నాగాయలంక: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో 86.95శాతం గృహాలలో కులగణన వివరాల సేకరణ పూర్తి అయినట్లు ఆదివారం ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్, ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ తెలిపారు. మండలంలోని సచివాలయాల పరిధిలో ముమ్మరంగా సాగుతున్న కులగణన పనితీరును వెరిఫికేషన్ అధికారులు పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలో17,055 గృహాలకు గాను ఇప్పటికి 14,839(86.95%)గృహాలలో 46,941మంది జనాభాలో 37,265(79.39%) మంది కులగణన వివరాలు సర్వే పూర్తి అయిందని ఈఓపీఆర్డీ అప్పలనర్సమ్మ విరించారు. ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల మేర మండలంలో 298మంది ఎన్యుమరేటర్లు, 136మంది సచివాలయ ఉద్యోగులు, అయిదుగురు వెరిఫికేషన్ అధికారులు, ఆరుగురు మండల స్థాయి పర్యవేక్షకులు కులగణన సర్వేలో విధులు నిర్వర్తిస్తున్నారు.

సరిహద్దులో విస్తృతంగా తనిఖీలు

కృత్తివెన్ను: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కృష్ణా పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం జరిపిన తనిఖీలలో భాగంగా ఒక వ్యక్తి వద్ద నుంచి అక్రమంగా తరలిస్తున్న 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇటీవల సరైన ఆధారాలు చూపని నగదుతో పాటు, అక్రమ మద్యం దొరుకుందని పేర్కొన్నారు.

కాలు విరిగిన వెంకటేశ్వరావుకు ఆర్థిక సాయం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): రోడ్డు ప్రమాదంలో కాలువిరిగిన రాయన వెంకటేశ్వరావుకు అవనిగడ్డ శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిశోర్ నాయుడు రూ. 7 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గాయపడిన బాధితుడిని వారి ఇంటి వద్ద ఆదివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.